# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ రాష్ట్ర అభివృద్ధి శాంతి భద్రతలపైనే ఆధారపడి ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ❖ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది మే నాటికి అందుబాటులోకి రానుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.
- ❖ వికసిత్ భారత్ - రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) బిల్లు 2025ను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్ సభలో ఈరోజు ప్రవేశపెట్టారు.

====================

స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్యాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ ఆరోగ్య ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. అలాగే ప్రజారోగ్య నిర్వహణకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వైద్య సేవలందించేలా అత్యున్నత స్థాయి సలహా బృందంతో అమరావతి నుంచి దృశ్య మాధ్యమ విధానంలో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన మరింత పెరగాలన్నారు. వివిధ ప్రమాణాలను అందుకునేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సూచలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నామన్నారు. హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ ఆంధ్రప్రదేశ్.. లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమీక్ష అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సచివాలయంలోని ప్రచార విభాగంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. వైద్యారోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు అవసరమైన సూచనలను నిపుణుల బృందం చేసిందని.. వారి సిఫార్సులు ఆరోగ్య, ఆనందదాయకమైన ఆంధ్రప్రదేశ్ సాధన కోసం ఉపకరిస్తాయని అన్నారు. నిపుణుల సలహాలను మరింత లోతుగా చర్చించి వాటిని రాష్ట్రంలో అమలు చేస్తామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

====================

రాష్ట్ర అభివృద్ధి శాంతి భద్రతలపైనే ఆధారపడి ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్ లో ఇటీవల ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఈ రోజు జరుగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తో కలిసి హోం మంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి 9 నెలల పాటు శిక్షణ మొదలుకానుంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హోం మంత్రి అనిత కొద్ది సేపటి క్రితం ప్రసంగిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

వికసిత్ భారత్ - రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) బిల్లు-2025ను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇరవై ఏళ్ల నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005 (MGNREGA) స్థానంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... కేవలం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన పాత చట్టం స్థానంలో తీసుకొస్తున్న ఈ కొత్త బిల్లు నిబంధనలు వికసిత్ భారత్-2047 విజన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. ఈ బిల్లు ప్రకారం ఉపాధి హామీ కింద పనిదినాలను వంద రోజులు నుండి 125 రోజులకు పెంచుతున్నామని తెలిపారు. 20 సంవత్సరాల క్రితం ఈ పథకాన్ని తీసుకొచ్చినప్పుడు ఉన్నటువంటి గ్రామీణ ప్రాంతాల్లోని పరిస్థితులు ఇప్పుడు లేవని, మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

విరామం

====================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వచ్చే సంవత్సరం మే నాటికి అందుబాటులోకి తీసుకురానున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ఎడ్యు సిటీ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో గోవా రాష్ట్ర గవర్నర్ పి. అశోక్ గజపతిరాజు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తో కలిసి ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయన్నారు. ఎడ్యుసిటీ ఉంటే ఎన్నో విద్యాలయాలు, యూనివర్సిటీలు ఏర్పాటవుతాయన్నారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపకరిస్తుందని రామ్మోహన్ నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

అనంతరం ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

(వాయిస్ 32 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయం, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరులోని మత్స్య శాఖ

కార్యాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి ప్రాధికార సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు ఆక్వా రైతులపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటోందన్నారు. దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యలకు ఉన్న నాణ్యత, విశ్వసనీయతపై విస్తృత ప్రచారం కల్పించామన్నారు. కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతుల పెంపు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

====================

వసతి గృహాలు, గురుకులాల్లో ఉండే విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు, గురుకులాలపై అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. అన్ని సంక్షేమ హాస్టళ్లు, అంబేద్కర్ గురుకులాల్లో ముస్తాబు కార్యక్రమం అమలు చేయాలన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

====================
====================